# సింగిల్ పేజీ కథలు

## రాంగ్‌నెంబర్

"విశాలా! ఇంకా ఎన్నాళ్ళు నీకు దూరంగా ఉండమంటావు. మనమధ్య జరిగే సంభాషణని బట్టి నా మనసు నువ్వే అర్థం చేసుకుంటావనుకుంటే ఏమీ అర్థం కానట్టు నటిస్తావేం?"

ఆ మాటలు విశాలతో చెప్పాలని చాలాసార్లు ప్రయత్నించాను. కానీ ప్చ్...ఆమె నాకా అవకాశం ఇవ్వలేదు. మౌనమే మనసు భాష. నా మనసు ఎప్పుడు తన మౌనాన్ని వదిలి విశాలతో తన గురించి చెప్పుకుంటుందో!

పక్క జిల్లాకి క్యాంపునకు వెళ్ళి రాత్రి పదిగంటలకు తిరిగివచ్చాను. ప్రయాణపు బడలికతో ఉన్నాను. అలాగని నిద్రపట్టలేదు. ఏదో ఆలోచిస్తూ వరండాలో కూర్చున్నాను. సెల్‌ఫోన్ మ్రోగింది. నెంబర్ చదవగానే ఎవరో అర్థమైంది.

"చెప్పరా" ఫోన్ ఆన్‌చేసి విశాలని గారం చేస్తూ అన్నాను.

"హు హు హు...సారీ సర్. మా అక్కయ్యకి చెయ్యబోయి మీ నెంబర్ డయల్ చేశాను" వినయంగా అంది విశాల.

"ఏం ఫర్వాలేదు విశాలా! నువ్వెప్పుడు ఫోన్ చేసినా నేనేమనుకోను" అన్నాను.

"థాంక్యూ సర్" అని ఫోన్ పెట్టేసింది విశాల.

రాంగ్‌నెంబర్ అని చెప్పినా ఆ ఫోన్ కాల్ నాకెంతో తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చింది. విశాల మధురమైన గొంతు వింటే చాలు, ఒంటరితనంలో మగ్గిపోతున్న నాకు గొప్ప రిలీఫ్.

నాలుగురోజులు గడిచాక-

రాత్రి ఎనిమిదిగంటలకి ఇంటికొచ్చాను. టీవీ ఆన్ చేస్తే అన్నీ చెత్త కార్యక్రమాలే. టీవీ కట్టేసి టేప్ రికార్డర్‌లో శాస్త్రీయ సంగీతం వింటున్నాను. అయినా మనసెందుకో చిరాగ్గా ఉంది. విశాల దగ్గర్నుంచి ఫోనొస్తే బావుణ్ణనిపించింది. సెల్‌ఫోన్ మోగింది. టేప్ ఆఫ్ చేసి, ఫోన్ తీసి నెంబర్ చూశాను. ఆనందం అవధులు దాటింది.

"నూరేళ్ళ ఆయుష్షు. ఇప్పుడే నీ దగ్గర్నుంచి ఫోన్ వస్తే బాగుండుననిపించింది. అనుకున్నట్లే వచ్చింది. చెప్పు విశాలా!"

"ప్చ్...అయ్యయ్యో! మళ్ళీ మా సిస్టర్‌కి చెయ్యబోయి రాంగ్‌నెంబర్ డయల్ చేశాను" మధురస్వరంతో అంది విశాల.

"ఏం ఫరవాలేదు విశాలా! అర్ధరాత్రి ఫోన్ చేసినా నేనేమనుకోను. అది సరే, ఇంకా పడుకోలేదా. చదువుకుంటున్నావా?" నా స్వరంలో ఆమె పట్ల నాకున్న అనురాగం విశాలకి స్పష్టమైంది.

"లేదండీ! టీవీ చూస్తున్నాను. సిస్టర్‌కి ఫోన్ చేద్దామని పొరబాటుగా మీ నెంబర్ డయల్ చేసి మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను" అంది విశాల.

"నో ప్రాబ్లమ్. ఇంతకీ మీ అక్కయ్య గారి నెంబరెంత?" యథాలాపంగా అన్నాను.

చెప్పింది విశాల.

ఒక్కసారి ఆశ్చర్యం వేసింది. ప్రక్క ప్రక్క నెంబర్లయితే రాంగ్‌నెంబర్ అనుకోవచ్చు. విశాల అక్కయ్య ఫోన్ నెంబర్ 8,9 సంఖ్యల కాంబినేషన్. నా ఫోన్ నెంబర్ 1, 2 సంఖ్యల కాంబినేషన్.

"ఓకే" అక్కడితో సంభాషణ పూర్తయ్యింది.

నెల్లాళ్ళు గడిచాక ఆఫీసులో ఒకరోజు.

"విశాలా! ఈనెల నీ ఇంటి ఫోన్ బిల్లు తెచ్చి చూపిస్తావా?" అడిగాను.

"సరే"నని ఆ మధ్యాహ్నమే బిల్లు చూపించింది.

విశాల రెండు రాత్రులు చేసిన ఫోన్ కాల్స్ రాంగ్‌నెంబర్లు కావని, కావాలనే చేసిన రైట్ కాల్స్ అనీ అర్థమైంది.

"దగ్గుని, ప్రేమని ఎవరూ దాచుకోలేరు విశాల! నువ్వు చేసినవి రాంగ్ నెంబర్స్ కాదు, ఖచ్చితమైన రైట్ కాల్స్. చూడు! ఇకనుంచి రాంగ్‌నెంబర్ అని నువ్వు తడబడక్కర్లేదు. రోజూ రాత్రి నిద్రపట్టేదాకా నాతో హాయిగా మాట్లాడవచ్చు" విశాలని ఆశ్చర్యంలో ముంచెత్తాను.

"ఎలా కనిపెట్టారండీ!" విశాల కళ్ళలో అవధులు దాటిన ఆనందం ప్లస్ కొంచెం సిగ్గు.

"సింపుల్. మీ అక్కయ్యతో మాట్లాడిన తర్వాతే నాతో మాట్లాడావు. దాన్నిబట్టి నువ్వు రాంగ్‌నెంబర్ డయల్ చెయ్యలేదని రైట్ పర్సన్‌కి రైట్ కాల్ చేశావని కనిపెట్టేశాను" వివరించాను.



నా మాటలకి ముసిముసినవ్వులు నవ్వుకుంది విశాల.

"ఏమండీ! నేనొకటడుగుతాను. ఏమనుకోకండీ. మీ దగ్గర వేరే క్యాసెట్లు ఏమీ లేవా? నేను రాత్రిపూట ఎప్పుడు ఫోన్ చేసినా 'మనసా ఎటులోర్తునే' అనే త్యాగరాజ కీర్తనే వింటుంటారు" అడిగింది విశాల.

"నీ విరహాగ్ని భరించలేక ఎప్పుడూ ఆ కీర్తనే వింటాను" విశాల సమాధానం కోసం ఎదురుచూస్తూ అన్నాను.

"ఈ పాట వినడం ఎప్పుడు మానేస్తారు?" కొంటెగా ప్రశ్నించింది విశాల.

"నువ్వు నన్ను చూడగానే 'కనుగొంటిని శ్రీరాముని నేడు' అని పాడుతూ నా హృదయానికి హత్తుకుపోయినప్పుడు. ఓకే?"

**-చాగంటి అశ్విని** (రాజమండ్రి)